జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
శనివారం, జూలై 18, 2026 పేజీలు : 8









# కౌకుంట్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

## - అంగన్‌వాడీలో నిర్లక్ష్యంపై షోకాజ్ నోటీసులు






-ఆకాశం వంక చూస్తున్న అన్నదాత.. వాన కోసం వేయికళ్లు!
-వరుణుడి కరుణ కోసం రైతన్నల ప్రార్థనలు
-ఆకాశం వంక చూస్యన్న అన్నదాత..వాన కోసం చేయకు!!




**చిన్నంబావి , జూలై 16 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నా నీటి కొరతతో ఎండిపోతుండగా, మరోవైపు దుక్కి దున్ని విత్తనాల కోసం సిద్ధం చేసిన పొలాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఆకాశం మేఘావృతమై కనిపిస్తున్నప్పటికీ చినుకు పడకపోవడంతో అన్నదాతల ఆశలు అడియాశలవుతున్నాయి. గత రెండేళ్లుగా వర్షాభావంతో నష్టపోయిన రైతులకు ఈ ఏడాది ప్రారంభంలో కురిసిన వర్షాలు కొంత ఊరటనిచ్చినా, జులైలో వర్షాలు తగ్గిపోవడంతో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు, బావులు ఎండిపోతుండగా, ఇప్పటికే నాటిన మొక్కజొన్నకు నీటి లేమితో వాడిపోతున్నాయి. పత్తి, మొక్కజొన్న వంటి పంటల సాగు కోసం అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులు ఇప్పుడు పెట్టుబడి తిరిగి వస్తుందా అనే ఆందోళనలో ఉన్నారు. నీటి కొరతతో మోటార్లను ఎక్కువసేపు నడపాల్సి రావడంతో విద్యుత్ ఖర్చులు కూడా పెరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. మండలంలోని గ్రామాలలో సాగు పనులు ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదని తెలుస్తోంది. సరైన సమయంలో వర్షాలు లేకపోతే దిగుబడులు తగ్గి తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జులైలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. ప్రభుత్వం పెట్టుబడి సాయం, రైతు భరోసా వంటి పథకాలను సకాలంలో అందించాలని, వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### వర్షాభావ పరిస్థితుల్లో స్వల్పకాలిక కూరగాయల సాగుపై

# రైతులు దృష్టి సారించాలి

## గద్వాల కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల జూలై 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):**
ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు బోరు బావుల్లో అందుబాటులో ఉన్న నీటి సామర్థ్యాన్ని బట్టి 60--70 రోజుల్లో దిగుబడినిచ్చే స్వల్పకాలిక కూరగాయల పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.మార్చి నెల నుంచి ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 64.9 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని,దీంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే



### జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు

# సమన్వయంతో చర్యలు చేపట్టాలి

## నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



# కౌకుంట్లలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..

మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం కౌకుంట్ల మండలంలోని పుట్టపల్లి, పేరూరు గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్యశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ సేవల అమలు, విద్య, వైద్యం, పోషకాహార కార్యక్రమాలపై ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహించారు. పుట్టపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించారు. బోర్డుపై రాసిన అక్షరాలను చదివించి విద్యా ప్రమాణాలను అంచనా వేశారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి విద్యార్థుల హాజరు, బోధనపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పుట్టపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతున్నదీ లేదీ పరిశీలించారు. కేంద్రానికి హాజరవుతున్న లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ సిబ్బంది, రోజువారీ పరీక్షలు, వైద్య సిబ్బంది వివరాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణితో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు.

పశువైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ పశువులకు అవసరమైన మందులు, టీకాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. కేంద్రం సమీపంలోని మురుగు కాలువ అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి వెంటనే శుభ్రపరచి ఫొటోలు పంపాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

పేరూరు అంగన్‌వాడీ-3 కేంద్రంలో చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించకుండా కేవలం అన్నం, నీళ్ల చారు మాత్రమే అందించడం, పరిశుభ్రత లోపించడం పట్ల కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అంగన్‌వాడీ టీచర్, ఆయాపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించగా, జిల్లా సంక్షేమ అధికారి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

చివరిగా పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సమీపంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటిస్తూ నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. అక్షయపాత్ర ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితుల్లో స్వల్పకాలిక కూరగాయల సాగుపై
# రైతులు దృష్టి సారించాలి

అవకాశం ఉందన్నారు.ఈ పరిస్థితుల్లో అధిక నీటి అవసరమున్న పంటల సాగును తగ్గించి,తక్కువ వ్యవధిలో కోతకు వచ్చే కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా రైతులు నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.రైతులకు ప్రోత్సాహంగా జిల్లాలోని 252 గ్రామపంచాయతీలకు ఐదు రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని కుటుంబ అవసరాలతో పాటు అదనపు ఆదాయం పొందేలా కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు.రుతుపవనాలు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో టమాటా,వంకాయ,మిరప,బెండ,మునగ,చిక్కుడు,గోరుచిక్కుడు,పాలకూర, సొరకాయ,కాకరకాయ,బీరకాయ,దోసకాయ వంటి స్వల్పకాలిక,కరువును తట్టుకునే రకాల పంటలను సాగు చేయాలని తెలిపారు.ముఖ్యంగా టమాటా,వంకాయ పంటల్లో అంటుకట్టిన నారుమొక్కలను వినియోగించడం,విడతల వారీగా నర్సరీలు ఏర్పాటు చేయడం ద్వారా తేమ ఒత్తిడిని తగ్గించి మెరుగైన దిగుబడులు పొందవచ్చని సూచించారు.కరువు పరిస్థితుల్లో నేలలో తేమను నిల్వ ఉంచేందుకు వరి గడ్డి,పంట అవశేషాలతో సేంద్రియ మల్చింగ్ చేయాలని,పశువుల ఎరువు,వర్మీకంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను వినియోగించాలని తెలిపారు.అలాగే గట్లు--కాలువల పద్ధతి, ఎత్తైన మడులపై సాగు,బిందు సేద్యం,మైక్రో స్ప్రింక్లర్ విధానాలను అనుసరించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని పేర్కొన్నారు.పంటల కీలక దశల్లో మాత్రమే ప్రాణరక్షక నీటిపారుదల అందించడం,కలుపు నివారణ చర్యలు చేపట్టడం, నీటిలో కరిగే ఎరువులను ఆకులపై పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు.కరువు పరిస్థితుల్లో త్రిప్స్,తెల్లదోమలు,పేనుబంకలు, నల్లి వంటి రసం పీల్చే కీటకాల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు పంటలను నిరంతరం పరిశీలించాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు సూచించే సమీకృత తెగుళ్ల నివారణ (ఐపీఎం) పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన చోట జీవ నియంత్రణ పద్ధతులు,వేప ఆధారిత పురుగుమందులు, శాస్త్రీయంగా సిఫార్సు చేసిన మందులను మాత్రమే వినియోగించాలని కోరారు. ఉల్లిపాయ సాగు చేసే రైతులు ఖరీఫ్‌కు అనువైన రకాలను ఎంపిక చేసుకోవడంతో పాటు నర్సరీ నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వర్షపు నీటిని నిల్వ చేసుకొని అవసరమైన సమయంలో పంటలకు వినియోగించడం,సూక్ష్మపోషకాలు,నీటిలో కరిగే ఎరువులను శాస్త్రీయ సూచనల మేరకు ఉపయోగించడం ద్వారా దిగుబడి,నాణ్యత పెరుగుతాయని కలెక్టర్ తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ,ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించి తక్కువ వ్యవధిలో అధిక ఆదాయం అందించే కూరగాయల సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.వ్యవసాయ శాఖ అధికారుల సలహాలను పాటిస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ మెరుగైన దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

## జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి

నారాయణపేట ప్రతినిధి జూలై 17 (ప్రజా జ్యోతి)ట్రాఫిక్ నిబంధనల అమలు, అవగాహన కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక అధ్యక్షతన, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సమక్షంలో జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై అవసరమైన హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలల పరిసరాలను స్కూల్ సేఫ్టీ జోన్‌లుగా అభివృద్ధి చేసి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.అదేవిధంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు సౌకర్యవంతమైన మార్గం కల్పించాలని, ప్రధాన రహదారులపై పార్కింగ్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని రోడ్డు భద్రతా పనులపై నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు.

ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు 108 అంబులెన్స్ సేవలను మరింత బలోపేతం చేయాలని, జాతీయ రహదారులపై అవసరమైన చోట అదనపు అంబులెన్సులు, అత్యవసర స్పందన కేంద్రాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసే గుడ్ సమారిటన్ (+శీశీ ఝఝతీఱఅ) పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రమాద బాధితులకు సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ...... ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఓవర్ స్పీడ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, మైనర్లు వాహనాలు నడపడం, ఫిట్‌నెస్ లేని వాణిజ్య వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతపై గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

# నకిలీ ఎరువులపై ప్రత్యేక నిఘా

**-- బిజినపల్లి మండలంలో నకిలీ డీఏపీ వినియోగం**
**-- ఘటనాస్థలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్**

నాగర్ కర్నూల్ జులై 17 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులకు నకిలీ ఎరువులు సప్లై చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎస్పీ పేర్కొన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా బిజినాపల్లి మండలంలోని మహదేవునిపేట గ్రామంలో నకిలీ డీఏపీ ఎరువులను రైతులు వినియోగించడం వ్యవసాయ అధికారులు గుర్తించి, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ సందర్భంగా రైతుల నుండి స్వాధీనం చేసుకున్న నకిలీ డిఏపీని పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్, రైతులకు తక్కువ ధరకు నకిలీ డీఏపీ ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించి మోసానికి...పాల్పడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందడంతో వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా గ్రామంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామానికి చెందిన ఏడుగురు రైతుల ఇళ్లలో నిల్వ ఉంచిన మొత్తం 111 బస్తాల అనుమానాస్పద డీఏపీ ఎరువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఇప్పటికే పంట పొలాల్లో వినియోగించిన 39 డీఏపీ ఖాళీ సంచులను కూడా అధికారులు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తులో భాగంగా భద్రపరిచారు.

స్వాధీనం చేసుకున్న ఎరువులను నరేందర్ రెడ్డి గ్రామంలో ఫెర్టిలైజర్ దుకాణదారుని ఇంటి వద్ద నిలిపి విచారిస్తూ , వాహనంలో భద్రపరచగా, విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. స్వాధీనం చేసుకున్న డీఏపీ బస్తాలను పరిశీలించి సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. నకిలీ ఎరువులు రైతుల చేతికి ఎలా చేరాయి, ఏ మార్గంలో సరఫరా జరిగిందనే అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మధు, కళ్యాణిలను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహదేవునిపేట గ్రామానికి చెందిన పొలిముని రాజు, నందిపేట బాలయ్య, దుగ్గని రాములు, బత్తుల రాములు, ఏ. ప్రవీణ్ కుమార్ రెడ్డి, జక్కా మన్యపు రెడ్డి, ఏ. జైపాల్ రెడ్డి అనే రైతులు కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ధరకు 1600, 1700 వందల రూపాయలకు ఒక బస్తా చొప్పున విక్రయించడంతో వారి వద్ద నుంచి ఈ డీఏపీ ఎరువులను కొనుగోలు చేసినట్లు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, స్వాధీనం చేసుకున్న డీఏపీ బస్తాల నుంచి నమూనాలను సేకరించి వెంటనే హైదరాబాద్‌లోని గుర్తింపు పొందిన ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపించాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా నివేదికలు అందిన వెంటనే చట్టపరమైన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. నకిలీ ఎరువులుగా నిర్ధారణ అయితే బాధ్యులపై ఎరువుల నియంత్రణ చట్టం, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సాధీనం చేసుకున్న నకిలీ డిఏపి ఎరువులను బిజినపల్లి రైతు వేదికలో భద్రపరచాలని కలెక్టర్ వ్యవసాయ అధికారుల ఆదేశించారు.

జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ. రైతులను మోసం చేసే నకిలీ ఎరువుల వ్యాపారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. రైతుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఈ కేసులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద నుంచే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ ధర కంటే చాలా తక్కువకు విక్రయిస్తున్నారని నమ్మి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. అనుమానాస్పదంగా ఎవరైనా ఎరువులు విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కలెక్టర్ రైతులను కోరారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాసులు, నాగర్ కర్నూల్ సీఐ , సిఐ అశోక్ రెడ్డి, బిజినపల్లి డిటి రవికుమార్, ఎస్ఐ షంషద్దీన్,ఇతర పోలీసు అధికారులు వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.



# ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోగా 100 శాతం ఆన్‌లైన్ చేయాలి

## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలను నిర్ణీత గడువులోగా 100 శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, తహసీల్దార్లతో వెబ్ఎక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం పోలింగ్ స్టేషన్ వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, ఆయా సమావేశాలకు బూత్ లెవల్ ఏజెంట్లు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 22వ తేదీలోపు గైర్హాజరు, ఇతర ప్రాంతాలకు మారిన , మరణించిన ఓటర్ల తుది జాబితాలను సిద్ధం చేసి బీఎల్ఓ సూపర్వైజర్లకు సమర్పించాలని ఆదేశించారు. అలాగే ఎన్యూమరేషన్



ఫారాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గడువులోగా పూర్తిచేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

మల్దకల్ జూలై 17(ప్రజా జ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు మారుతి,జిల్లా అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ,రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు.రాష్ట్రంలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సొంత భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున కొత్త భవనాలను మంజూరు చేసి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని



కోరారు.విద్యా రంగ అభివృద్ధి కోసం రాష్ట్రానికి పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పీడీఎస్‌యూ నాయకులు హెచ్చరించారు.అనంతరం పీడీఎస్‌యూ మల్దకల్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు ప్రభువరుణ్,కార్యదర్శి రాజ్‌కుమార్,పృథ్వి,హర్ష,వివేక్,చంటి,ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గద్వాల జూలై 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర,బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ,యూఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా బీసీ సంక్షేమ అధికారి అక్బర్ పాషాకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ,జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ,అందుకు అనుగుణంగా వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అనేక హాస్టళ్లలో ఒకే గదిలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో చదువుకు,విశ్రాంతికి అనువైన వాతావరణం లేక వారి విద్యాభ్యాసం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే అద్దె భవనాలను ఏర్పాటు చేసి సరిపడా వసతి కల్పించాలని,దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హ విద్యార్థికి హాస్టల్‌లో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా హాస్టళ్లలో నాణ్యమైన,పోషకాహారంతో కూడిన భోజనం అందించడంతో పాటు మెనూ ప్రకారం ఆహారం సరఫరా చేయాలని, తాగునీరు,పరిశుభ్రమైన మరుగుదొడ్లు,స్నానాల గదులు,విద్యుత్,ఫ్యాన్లు,పడకలు, పరుపులు,స్టడీ టేబుళ్లు,లైటింగ్,భద్రత తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. పేద,మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరమని పేర్కొంటూ, అధికారులు వెంటనే అన్ని హాస్టళ్లను పరిశీలించి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే పీడీఎస్‌యూ,యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలింపాషా,యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.




# నేరాల నియంత్రణకు ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు

**నారాయణపేట ప్రతినిధి జూలై 17 (ప్రజా జ్యోతి)**



నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను మరియు పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు నరసింహ, సుధాకర్ లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.శుక్రవారం నారాయణపేట బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలలో, బ్యాంకు ల వద్ద నారాయణపేట పోలీసులు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తుల వేలిముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఎస్ ఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గున్ముక్ల గ్రామంలో ఆ భూమిని ఎవరూ కబ్జా చేయలేదు

**ధన్వాడ జూలై 17 (ప్రజా జ్యోతి)**

నారాయణ పేట ధన్వాడ మండలంలోని గున్ముక్ల గ్రామంలో కబ్జాకు గురవుతున్న భూమి అనే శీర్షికతో నేటి సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తా కథనంపై గున్ముక్ల గ్రామ యువజన సేవా సంఘం సభ్యులు గ్రామ ప్రజలు స్పందించారువారు మాట్లాడుతూ వార్తలో ఆరోపణలు చేసిన వ్యక్తులు గ్రామంలో ఖాళీగా ఉన్న స్థలంపై కన్నేసి దానిని క్రయవిక్రయాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు ఆ స్థలం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లకుండా భవిష్యత్తులో గ్రామ ప్రజల అవసరాల కోసం ఉపయోగపడేలా మట్టిని పోసి చదును చేసి భద్రపరిచామని పేర్కొన్నారుఈ స్థలాన్ని ఎవరూ వ్యక్తిగతంగా కబ్జా చేయలేదని ముఖ్యంగా సర్పంచ్ భర్తకు భూమిని కబ్జా చేయాల్సిన అవసరం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు ఈ విషయంపై సంబంధిత అధికారులు ఎలాంటి విచారణ చేపట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారుఅలాగే తప్పుడు ఆరోపణలు చేసి గ్రామ ప్రజలను గ్రామ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

ఈ ప్రకటనపై సంతకం చేసిన వారు

నడిమింటి కథలప్ప గుండు తిమ్మయ్య దాసరి తిమ్మయ్య లొడ్డ తిమ్మయ్య గండి తిమ్మయ్య జింకల తిమ్మయ్య ఈశ్వర తిమ్మయ్య సిబి నర్సింలు చింతల్ రంగప్ప మాసకోల బాలప్ప జి క్రాంతి మోహన్ జి అడ్డిఅప్ప పట్నం శంకర్ కొత్త నాగరాజు కొత్త చంద్రప్ప మోసకోల తిమ్మయ్య కొండాపురం నరేష్ చెక్క వెంకటయ్య మసకల తిమ్మరాజు గుండు సతీష్ కుమార్ గుండు వెంకట రాములు బిజ్వార్ రాజు లొడ్డ రాములు ఈశ్వర్ రాములు తదితరులు



## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ హరిప్రియ

**మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలో కొనసాగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ శుక్రవారం నవాబ్‌పేట మండలంలోని కొల్లూర్ గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ నంబర్లు 1, 2, 3, 5లలో జరుగుతున్న డిజిటైజేషన్ పనుల పురోగతిని తనిఖీ చేసిన ఆమె, ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, తప్పులు లేకుండా, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో నవాబ్‌పేట తహసీల్దార్, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

2



# పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**-నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు**
**-ప్రారంభించిన పనులను బాధ్యతతో పూర్తి చేయాలి**
**-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ : జులై 17 (ప్రజా జ్యోతి)

గ్రామ పంచాయతీ కార్యాలయాలు,అంగన్‌వాడీభావనాలు,మహిళా సంఘాల నూతన భవనాలపనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులు ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ల్లో పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించి జిల్లాలోని అన్ని మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు సంబంధిత అధికారులతో మండలాలవారీగా పనుల పురోగతిని సమీక్షిస్తూ ప్రతి పనికి సంబంధించిన ప్రస్తుత స్థితి,పూర్తి శాతం,సమస్యలు,జాప్యానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతతో త్వరతగతిన పూర్తి చేయాలని నిర్మాణాలు ప్రారంభమైన భవనాలను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, మహిళా సంఘాల కోసం నిర్మిస్తున్న మహిళా భవనాలు,ఆహార ధాన్యాల గోదాములు,ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణాలను వేగవంతంచేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు.జిల్లాలో సీసీ రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నప్పటికీ,గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ పరిస్థితికి గల కారణాలను గుర్తించిఅవసరమైన చర్యలు తీసుకొని పనులను పూర్తి చేయాలని,సాంకేతిక,పరిపాలన ఇతర సమస్యలు ఉంటే వాటిని వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని అసిస్టెంట్ ఇంజనీర్లు తమ పరిధిలోని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించి కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల నాణ్యతను కాపాడుతూ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రజల డబ్బుతో చేపడుతున్న అభివృద్ధి పనులు కావడంతో ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పనులుప్రారంభించిన తర్వాత మధ్యలో వదిలేయకుండా పూర్తి బాధ్యతతో పూర్తి చేయాలని సూచించారు.తదుపరి నిర్వహించే సమీక్ష లో ఐదు



మండలాల పనులను పూర్తిస్థాయిలో సమీక్షిస్తామని,అప్పటికి పనుల్లో పురోగతి కనిపించకపోతె సంబంధిత అధికారులు,ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని,అన్ని మండలాల అధికారులు తమ పరిధిలోని ప్రతిపనికి సంబంధించిన సమగ్ర పురోగతి నివేదికను గడువులో సమర్పించాలని, ఏ పనులు పూర్తయ్యాయి,ఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయి,జాప్యానికి కారణాలు,పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు వంటి పూర్తి వివరాలను నివేదికలో పొందుపరచాలని నివేదిక ఆధారంగానే తదుపరి కార్యాచరణ,అధికారుల పనితీరుపై నిర్ణయాలు తీసుకుంటామనన్నారు.ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని ముందుగా పనులను పూర్తి చేయడంపైనే అధికారులు దృష్టి సారించాలని, అదనపు నిధుల అవసరముంటే పనుల యొక్క పురోగతిని బట్టి పరిశీలిస్తామని,బడ్జెట్ పేరుతో పనులు నిలిపివేయడం సమంజసంకాదని మౌలికవసతులు సకాలంలో అందించడమె ప్రభుత్వ లక్ష్యమని,లక్ష్య సాధనలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,జిల్లా అభివృద్ధిలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని,గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి అయితే ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని అన్నారు.ఈ సమీక్ష సమావేశంలోఈఈ పంచాయతీ రాజ్ విజయ్ కుమార్,జిల్లా స్థాయి ఇంజనీరింగ్ అధికారులు, డివిజనల్ అధికారులు,వివిధ మండలాల ఏ.ఈలు తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

ధన్వాడ జూలై 17 (ప్రజా జ్యోతి)

నారాయణపేట జిల్లా ధన్వాడ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ (ఖూా) శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్‌లోని అన్ని విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించారు ప్రజలకు వేగవంతమైన పారదర్శకమైన నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారుఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు పెండింగ్ కేసులు కోర్టు విచారణలో ఉన్న కేసులు పిటిషన్లు వారెంట్ల అమలు గ్రేవ్ నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును నిర్దిష్ట గడువులో పూర్తి చేసి శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు పటిష్టమైన సాక్ష్యాధారాలతో ఛార్జిషీట్లు దాఖలు చేసి నేరస్థులకు చట్టపరమైన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు శాంతిభద్రతల పరిరక్షణలో బీట్ వ్యవస్థ కీలకమని పేర్కొన్న ఎస్పీ ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్లను సమర్థవంతంగా కేటాయించి గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పోలీసులపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు

అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారుపోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదపూర్వకంగా స్వాగతించి వారి సమస్యలను ఓర్పుతో విని ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి నిర్ణీత గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు ప్రజల్లో పోలీస్ శాఖపై సానుకూల అభిప్రాయం ఏర్పడేలా సిబ్బంది వ్యవహరించాలని సూచించారుస్టేషన్ పరిశుభ్రత రికార్డుల నిర్వహణ సిబ్బంది క్రమశిక్షణ విధుల నిర్వహణ కార్యాలయ నిర్వహణ వంటి అంశాలను కూడా ఎస్పీ పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు పోలీస్ స్టేషన్‌ను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ప్రజలకు అనుకూలంగా నిర్వహించాలని ఆదేశించారు

ఈ తనిఖీలో మరికల్ సీఐ భగవంత్ రెడ్డి ఇన్‌చార్జ్ ఎస్సై మహేశ్వరి మరియు ధన్వాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు




## పాలమూరు'కు కాంగ్రెస్ విద్రోహం

**- సర్కారు తీరుతో జలహక్కులకు విఘాతం**
**- ట్రిబ్యునల్‌లో వాదనలన్నీ నిర్వీర్యం**
**- ఇకనైనా ఒప్పందాలను మానుకోవాలి**
**- ఏపీ సీఎం బాబు కుట్రలను తిప్పికొట్టాలి**
**- లేదంటే ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం**
**- సామజిక కార్యకర్త, టీఆర్ఎస్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ హెచ్చరిక**

నారాయణపేట ప్రతినిధి జూలై 17 (ప్రజా జ్యోతి)

ఉమ్మడి పాలమూరు జిల్లాకు కాంగ్రెస్ పార్టీ తీరని విద్రోహానికి తలపెడుతున్నది. దశాబ్దాలు పోరాడి ట్రిబ్యునల్‌ను సాధించుకుని, కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా దక్కే తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు వాటిని ఎత్తగొట్టే చర్యలకు పూనుకుంటున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై యావత్ పాలమూరు జిల్లా భవిష్యత్ ప్రయోజనాలను ఫణం పెడుతున్నారు. నీటివాటాలపై, ట్రిబ్యునల్ కేటాయింపులపై కనీస అవగాహన లేకుండా రాజకీయ ప్రయోజనాల కోసం చారిత్రక ద్రోహానికి తలపెడుతున్నారు.

గత ప్రభుత్వం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90టీఎంసీలను కేటాయించింది. ప్రాజెక్టు అనుమతుల కోసం డీపీఆర్‌ను సైతం కేంద్రానికి సమర్పించింది. . కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పనులను పడావు పెట్టింది. డీపీఆర్ వెనక్కి వచ్చినా రెండున్నరేళు గా కిక్కురుమనకుండా ఉన్నది.

ఇప్పుడు బనకచర్లకు అనుమతిస్తే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎన్‌వోసీ ఇస్తామంటూ కేంద్రం, పొరుగున చంద్రబాబు ప్రకటించగానే ఇక్కడ రేవంత్‌రెడ్డి సర్కారు సైతం కనీస అవగాహన లేకుండా సై అంటున్నది. కేంద్రం, ఏపీ చేస్తున్న ప్రతిపాదనలు కుట్ర పూరితమైవి. వాటికి అంగీకరిస్తే తెలంగాణకు, యావత్ పాలమూరు జిల్లా జలహక్కులకు శాశ్వత సమాధి కట్టినట్లే.

కృష్ణా పరివాహక ప్రాంతం ఎక్కువగా ఉంది. కరువు, దుర్భిక్ష ప్రాంతం ఎక్కువగానే ఉన్నది. సాగుకు యోగ్యమై, నీరందక దశాబ్దాలుగా బీడు భూములున్నాయి. పూర్తిగా బేసిన్‌లోనే ఉన్నది. ఏ ప్రమాణాలను ఆధారంగా తీసుకున్నా కూడా కృష్ణా జలాల్లో తెలంగాణకు 70శాతానికిపై జలాలు దక్కాలు. అయినా దశాబ్దాలు ఉమ్మడి పాలకులు పాలమూరుకు కృష్ణా జలాలు దక్కకుండా చేశారు. ఉమ్మడి పాలనలో జలహక్కులపై, డిమాండ్లపై ట్రిబ్యునల్ ఎదుట గొంతు వినిపించే అవకాశం లేకుండా పోయింది. కానీ తెలంగాణ ఏర్పాటు తరువాత, ట్రిబ్యునల్ ఎదుట వాదనలు వినిపించుకునే సువర్ణ అవకాశం దక్కింది. న్యాయమైన వాటాను పొందేందుకు మార్గం సుగమమైంది. ఇప్పటివకే వాదనలన్నీ తుది దశకు చేరుకున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లోనే అవార్డును ప్రకటించే అవకాశమున్నది. కృష్ణాలో 775టీఎంసీలకుపై దక్కుతాయని ప్రభుత్వమే అనేక మార్లు వెల్లడించింది. ఆ జలాల్లో పాలమూరుకు 90టీఎంసీలు, దిండికి 30పోగా, పాలమూరు జిల్లాలోని మిగతా వరద ఆధారిత అన్ని ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించుకోవచ్చు. ఎవరి దయాదక్షిణ్యాలపై ఆధారపడాల్సిన అవసరమే లేదు. కేంద్రం, ఏపీ ముందు మోకరిల్లాల్సిన పనే లేదు.

కానీ రేవంత్‌రెడ్డి న్యాయబద్ధంగా, సాధికారిత గల ట్రిబ్యునల్‌లో వాటా సాధించేందుకు యత్నాలు మాని ఇప్పుడు పొరుగున ఏపీతో ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధమవడం దుర్మార్గం. చారిత్రక ద్రోహం. జలహక్కులకు తీరని విఘాతం. రాష్ట్రంతో ఒప్పందం చేసుకుంటే ట్రిబ్యునల్‌లో వాదనలన్నీ వీగిపోతాయి. జలహక్కులన్నీ మళ్లీ కొల్లగొట్టుకు పోతాయి. ఈమాత్రం కనీస అవగాహన లేకుండా సర్కారు వ్యవహరించడం దుర్మార్గం.

కేంద్ర ప్రభుత్వం సైతం పాలమూరుపై వివక్ష చూపుతున్నది. ఏపీ ప్రభుత్వం పోలవరం బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపగానే అనుమతుల కోసం



హడావుడి చేస్తున్నది. పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులకు ఏకంగా మధ్యవర్తిత్వం నెరుపుతున్నది. కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతులివ్వకుండా డీపీఆర్‌ను వెనక్కి పంపింది. ఇప్పుడు ఎన్‌వోసీ ఇవ్వాలంటే బనకచర్లకు ఒప్పుకోవాలంటూ షరతులు పెట్టడం దారుణం. తుంగభద్రపై కర్నాటక ప్రాజెక్టులకు నజరానాలను ప్రకటించి ఆ విధంగానూ అన్యాయం తలపెడుతున్నది. ఇకనైనా కేంద్రం, ఏపీ కుట్రలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుర్తెరగాలి. వాటిని తిప్పికొట్టాలి. అవార్డు వచ్చేవరకూ చర్చలకు, ఒప్పందాలకు తావులేదని తేల్చిచెప్పాలి. పాలమూరు జిల్లా ప్రాజెక్టులకు నికర జలాలను న్యాయబద్ధంగా సాధించేందుకు కృషి చేయాలి. కేంద్రం ఇటీవల ఏర్పాటు నుంచి కమిటీల నుంచి తెలంగాణ సర్కారు తక్షణం తప్పుకోవాలి.

అలాకాకుండా ఎన్‌వోసీ పేరిట నమ్మబలికుతూ ఒప్పందాలకు సిద్ధమవ్వాలని చూస్తే పాలమూరులో మరో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతాం. కాంగ్రెస్ను గుణపాఠం చెబుతాం.

# లిఫ్ట్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ల చోరీ..

**ఘటన స్థలాన్ని సందర్శించిన బీఆర్ఎస్**
**రైతుల సాగునీటితో చెలగాటం ఆడొద్దు.. దొంగలను వెంటనే పట్టుకోవాలి**
**ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరుస దొంగతనాలు జరుగుతున్నాయంటూ మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు**



**చిన్నంబావి,జూలై 17 (ప్రజాజ్యోతి)**

వనపర్తి జిల్లా, చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ గ్రామ సమీపంలో ఉన్న చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్.పంప్‌హౌస్‌కు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్లు చోరీకి గురైన ఘటనపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సూచనల మేరకు శుక్రవారం సంఘటన స్థలాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు పరిస్థితిని పరిశీలించి, ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.రైతులకు సాగునీరు అందించే కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఈదన్న మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు నాయకత్వంలో, అప్పటి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రత్యేక చొరవతో దాదాపు రూ.7 కోట్ల వ్యయంతో చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఆధునిక మోటార్లు ఏర్పాటు చేసి.పునరుద్ధరించామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా నిర్వీర్యంగా ఉన్న ఈ చిన్నమారు లిఫ్టును తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చి దాదాపు 6 వేల ఎకరాలకు సాగునీరు అందించి రైతుల జీవితాల్లో వెలుగులు నింపామని గుర్తు చేశారు.అలాంటి రైతు ప్రయోజనాల కోసం నిర్మించిన పథకం నేడు వరుసగా దొంగతనాలకు గురవుతుండటం బాధాకరమన్నారు. వర్షాకాలం ప్రారంభమైన వేళ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుంచి గుర్తుతెలియని దుండగులు కాపర్ వైర్ ను ఎత్తుకెళ్లా వేలాది ఎకరాల రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొన్నదన్నారు. ప్రభుత్వం,అధికారులు వెంటనే స్పందించి నిందితులను పట్టుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.పెద్ద మారూర్ గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో పాత మోటార్లను తొలగించి అత్యాధునిక సాంకేతికతతో కొత్త మోటార్లు ఏర్పాటు చేయడం వల్ల 6 వేల ఎకరాలకు సాగునీరు అందే పరిస్థితి ఏర్పడిందన్నారు. పాత సామగ్రిని స్క్రాప్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాత మోటార్ల సామాన్లు రెండు కోట్ల అమ్ముకున్నారు వచ్చిన నిధులతో లిఫ్ట్‌కు కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉంటే ఈ రోజు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనా అధికారులు లిఫ్ట్ భద్రతపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. వెంటనే సీసీ కెమెరాలు, రాత్రి భద్రతా సిబ్బంది ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ మాట్లాడుతూ.. గతంలో కూడా ఇలాంటి దొంగతనాలు జరిగినప్పుడు పోరాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామని, ప్రస్తుతం వాటి నిర్వహణను అధికారులు పూర్తిగా విస్మరించారని అన్నారు. కృష్ణానదిలో నీరు వచ్చినా లిఫ్ట్ పనిచేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు.మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మాట్లాడుతూ.. రైతులు ఇప్పటికే వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్ఫారం నుంచి ఆయిల్ ని కిందికి వదిలేసి కాపర్ వైర్ దొంగిలించడం దురదృష్టకరమన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మరమ్మతు చేయడం లేదా కొత్తది ఏర్పాటు చేసి సాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వద్దేమాన్ రామకృష్ణ మాట్లాడుతూ.. మంత్రి గారి సొంత మండలంలోనే వరుస దొంగతనాలు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు.



గతంలో పెద్దదగడ కోల్డ్ స్టోరేజ్‌లో వద్ద చోరీ జరిగినా ఇప్పటి వరకు దర్యాప్తు పూర్తికాలేదని గుర్తు చేశారు. ఈ ఘటనపై సీబీసీఐడీతో విచారణ జరిపించి అసలు నిందితులను గుర్తించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కంటే అధికార పార్టీకి రాజకీయాలే ముఖ్యమయ్యాయని విమర్శించారు. కొప్పునూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు డేగ శేఖర్ మాట్లాడుతూ.. చిన్నమారూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందని, ఇలాంటి సమయంలో కాపర్ వైర్ చోరీ జరగడం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. మంత్రి సొంత మండలంలోనే రైతుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని విమర్శించారు.ఈ కార్యక్రమంలో. ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు బి ఆర్ ఎస్ నాయకులు చెల్లపాడు గ్రామ సర్పంచ్ పెద్ద నరసింహ, సర్పంచ్ మద్దూరి శంకర్, చిన్నమారు మద్దిలేటి, కొప్పునూరు మహేష్ రెడ్డి, భగవంత రెడ్డి, సంపంగి మద్దిలేటి, గూడెపు శివారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తగరం కురుమయ్య, పెద్ద దగడ గంగేశ్వర్ గౌడ్,సంకటి మదిలేటి,మాజీ ఉపసర్పంచ్ బీసన్న, అయ్యవారిపల్లి స్వామి, చిన్నమారు గ్రామ రైతు కమిటీ పింజరి భాష, గుండా వెంకటస్వామి, శంకర్ మోహన్, లొంక నాగేశ్వర్ రెడ్డి,తగరం నాగరాజు, బెక్కెం కాంతయ్య, రామస్వామి,వెంకటయ్య, చిన్న నాగన్న, శ్రీనివాసులు, నాగరాజు, వివిధ గ్రామాల రైతులు మరియు టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.కాపర్ వైర్ చోరీకి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, లిఫ్ట్ ఇరిగేషన్‌ను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని, లేకపోతే మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

## మిగిలిన విద్యార్థులకు జూలై 20న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**: డీఎంహెచ్‌వో డా.సంధ్యకిరణ్మయి**

**గద్వాల జూలై 17(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గత సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోలేకపోయిన 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు,యువతకు జూలై 20 (సోమవారం)న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా తిరిగి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా.సంధ్యకిరణ్మయి తెలిపారు.జిల్లా ఉప వైద్యాధికారి డా.అస్గర్ అలీ పర్యవేక్షణలో జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు,కేజీబీవీలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.గత కార్యక్రమంలో మాత్రలు తీసుకోని విద్యార్థులందరికీ ఈ నెల 20న ఆయా విద్యాసంస్థల్లోనే తప్పనిసరిగా మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరు కూడా మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి ఆదేశించినట్లు తెలిపారు.

హెచ్‌పీవీ టీకాపై అపోహలు నమ్మొద్దు

జిల్లాలో కొనసాగుతున్న హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమంపై ప్రజలు ఎలాంటి అపోహలు నమ్మవద్దని డీఎంహెచ్‌వో సూచించారు.14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వ ఆసుపత్రులు,ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకాను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.భారతీయ మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ అత్యంత సాధారణ క్యాన్సర్లలో రెండో స్థానంలో ఉందని పేర్కొంటూ,ఈ వ్యాధి నివారణలో హెచ్‌పీవీ టీకా అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని తెలిపారు.టీకా వల్ల ఎలాంటి హానికరమైన దుష్ప్రభావాలు ఉండవని, అర్హత కలిగిన ప్రతి బాలికకు తప్పనిసరిగా టీకా వేయించాలని తల్లిదండ్రులను కోరారు.

టీబీ బాధితులకు పోషకాహార కిట్ల పంపిణీ

ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డా.రాజు ఆధ్వర్యంలో క్యూబ్ రూట్స్ సంస్థ అందజేసిన 50 పోషకాహార కిట్లను టీబీ బాధితులకు డీఎంహెచ్‌వో డా.సంధ్యకిరణ్మయి పంపిణీ చేశారు.టీబీ బాధితులు మందులతో పాటు పోషకాహారం తీసుకుంటే వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీబీ రోగులకు పోషకాహార కిట్లు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.టీబీ బాధితులను దత్తత తీసుకుని పోషకాహార సహాయం అందించాలనుకునే వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని డీఎంహెచ్‌వో కోరారు.




## జిల్లాలో అత్యధిక సంఖ్యతో ముడుమాల

**మండల విద్యాశాఖ అధికారి నిజాముద్దీన్**

**కృష్ణా మండల జూలై 17 (ప్రజా జ్యోతి)**

కృష్ణ మండలంలోని ముడుమాల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి శ్రీ నిజాముద్దీన్ ఆకస్మికంగా మధ్యాహ్నం 2గంటలకు తనిఖీ చేశారు..ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సంఖ్య,మధ్యాహ్న భోజన వివరాలు,పాఠశాల వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాలలో మొత్తం విద్యార్థులు 306 కు గాను 272 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు 4గురు మాత్రమే ఉండటాన్ని గమనించిన వారు ఉపాధ్యాయుల సర్దుబాటు కొనసాగుతున్నందున వారు వచ్చి జాయిన్ అవుతారని తెలిపారు.

అదేవిధంగా నారాయణపేట జిల్లాలలో అత్యధిక నమోదు గల పాఠశాలగా రికార్డు(306) నెలకొల్పిన పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్,ఉపాధ్యాయులు రవికుమార్,పద్మావతమ్మ, కలిమొద్దీన్ పాఠశాల సిబ్బంది సోఫీ,రేణుక,శ్రీదేవి,శివమ్మ తదితరులు ఉన్నారు



# అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలి

### జిల్లా కలెక్టర్ ప్రియాంక.



నారాయణపేట ప్రతినిధి జూలై 17 (ప్రజా జ్యోతి)

ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు పూర్తి అంకిత భావం, క్రమశిక్షణతో చదవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని అశోక్ నగర్ కు వెళ్లే మార్గంలో గల లయన్స్ క్లబ్ భవనంలో ఆ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని, వారియర్స్ డిఫెన్స్ అకాడమీ/లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఇస్తున్న శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న యువతీ యువకులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. సుమారు 15 సంవత్సరాల క్రితం తాను కూడా ఇలాగే ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యాననీ తెలిపారు. ఇప్పటికీ ఎంతో మంది ఆసక్తితో చదువుకోవడం చూస్తే చాలా సంతోషంగా ఉంటుందన్నారు.

శిక్షణ పొందుతున్న వారు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, రాయబోయేది కేవలం ఒక పరీక్ష మాత్రమే. మనం 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలు ఎలా రాశామో, ఇదీ అలాంటి మరో పరీక్షగానే భావించాలని చెప్పారు. అనవసరంగా ఒత్తిడికి గురికావద్దన్నారు.ప్రతి ఒక్కరికి అవసరమైంది ఒక్క సీటు మాత్రమే అని "ఎన్ని పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది?", "ఎంత మంది పరీక్ష రాస్తున్నారు?", "పరీక్ష వాయిదా పడుతుంది", "పరీక్ష జరగదు" వంటి పుకార్లను అస్సలు నమ్మ రాదని తెలిపారు. ప్రభుత్వ పరీక్షలకు సిద్ధమవుతున్నప్పుడు పూర్తి అంకితభావంతో, క్రమశిక్షణతో చదవాలని ఆమె పునరుద్ఘాటించారు. ఒక్క వారం చదవకుండా వదిలేస్తే, అదే సమయంలో చదవాల్సిన ప్రశ్న పరీక్షలో వచ్చి మార్కులు కోల్పోయే అవకాశం ఉంటుందనే అనే భావనతో ప్రతిరోజూ చదవాలన్నారు. తాను కూడా అదే విధంగా సిద్ధమయ్యాననీ, అదే తనకు మంచి ఫలితాన్ని ఇచ్చిందనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరినారాయణ బట్టాడ్,ఆత్మారామ్ ఎద్కే, లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, శ్రీనివాస్ లాహోటీ, బాలాజీ, జనార్దన్, సచిన్ మంగ్లీ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల వృద్ధ మహిళలకు ఉచిత కంటి శుక్లాల శస్త్ర చికిత్స

### -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ : జూలై 17 (ప్రజా జ్యోతి)

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతనశుక్రవారం పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖలపై నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లాలో మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వృద్ధ మహిళలకు కంటి శుక్లాల క్యాటరాక్ట్ సమస్యలు ఉంటే అలాంటి వారిని ప్రత్యేకంగా గుర్తించి,వారికి ఉచితంగా పరీక్షలు,శస్త్రచికిత్సలు నిర్వహించేలా తాను స్వయంగా చర్యలను చేపట్టనున్నట్లు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళా సంఘ సభ్యుల్లో వయోభారంతో కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న మహిళలు ఉన్నారని,ఇటీవలే తాడూరు మండలం కేంద్రంలో ఒక మహిళను గుర్తించడం జరిగిందని అలాంటి వారు ఆర్థిక ఇబ్బందులు లేదా అవగాహన లోపం కారణంగా చికిత్సకు దూరమవుతున్నారని అందువల్ల ప్రతి గ్రామంలో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి, కంటి శుక్లాల సమస్యతో బాధపడుతున్న వృద్ధ మహిళలను గుర్తించి పూర్తి వివరాలతో వారి జాబితాను సిద్ధంచేసి గుర్తించిన మహిళలందరికీ తూడుకుర్తిలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో ప్రత్యేకంగా కంటి శుక్లాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి యజమాన్యంతో మాట్లాడి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.అంతేకాకుండా గ్రామాల నుంచి ఆసుపత్రికి వెళ్లి రావడానికి అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా తానే స్వయంగా కల్పిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రవాణా సమస్య కారణంగా ఒక్క మహిళ కూడా చికిత్సకు దూరం కాకుండా పూర్తి ఏర్పాట్లను చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.మహిళా అభివృద్ధి,గ్రామీణాభివృద్ధి,కృషి వైద్య ఆరోగ్య శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి,అర్హులైన ప్రతి వృద్ధమహిళకు ఈ సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,జిల్లాలోని ప్రతి గ్రామంలో మహిళా సంఘాల ద్వారా విస్తృత అవగాహన,ప్రచారం కల్పించి,కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని వెంటనే గుర్తించి చికిత్సకు పంపించాలన్నారు.ఈ కార్యక్రమం ద్వారా వృద్ధ మహిళలకు మెరుగైన కంటి ఆరోగ్యం అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమె ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు.

### కస్తూరిబా బాలికలకు నూతన యూనిఫాంల పంపిణీ



చిన్నంబావి, జూలై 17 (ప్రజా జ్యోతి)

చిన్నంబావి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం విద్యార్థినులకు ప్రభుత్వం అందించిన నూతన యూనిఫాంలను పంపిణీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థులకు దుస్తులను అందజేసి, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. నూతన యూనిఫాంలు అందుకోవడంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డీపీఎం ఆనంద్, ఏపీఎం అనిల్, మండల మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ, ప్రిన్సిపాల్ ఎస్.ఓ. సుజాత, ఉపాధ్యాయులు, వీఓఏఎస్ అధ్యక్షుడు శాంతయ్య, ఇతర వీఓఏఎస్ సభ్యులు, కే లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాలకులు మారినా... పాలమూరు ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లోనే :

### -రాఘవ చారి'



మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పాలకులు మారినా పూర్తి కాలేదని, రైతులకు తీవ్ర అన్యాయం కొనసాగుతోందని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ కన్వీనర్ రాఘవ చారి అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది బెక్కం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన "ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన సదస్సు" లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఆర్డీఎస్, జూరాల, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 72 జీవో అమలు చేస్తూ కృష్ణా-భీమా సంగమం వద్ద రోజుకు 5 టీఎంసీల నీటిని ఎత్తిపోసే పథకాన్ని చేపట్టాలని సూచించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, కాలువలు, పంప్ హౌస్ పనులను పూర్తి చేయాలని, డిండి లిఫ్ట్ పేరుతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు నీటి మళ్లింపును నిలిపివేయాలని కోరారు. నల్గొండ జిల్లాకు అవసరమైన నీటిని నాగార్జునసాగర్--గొట్టిముక్కుల లిఫ్ట్ ద్వారా అందించాలని, ఉల్వర బ్యారేజీ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని అన్నారు.

అదేవిధంగా రామగిరి రిజర్వాయర్ నిర్మాణం, చంద్రసాగర్--అమ్రాబాద్ ఎత్తిపోతల, జూరాల గట్టు ఎత్తిపోతల, వెల్టూరు--గొందిమల్ల బ్యారేజీ వంటి పనులను వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా, భీమా నదులపై కొత్త బ్యారేజీల నిర్మాణం చేపట్టి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని, తుంగభద్ర ఎడమ కాలువను తెలంగాణలోకి పొడిగించాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీటిలో జరుగుతున్న వివక్షను నివారించేందుకు ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేసి నివేదిక విడుదల చేయాలని, ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, భూమి ఇవ్వాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వంతో పోరాడి కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా సాధించాలని, గోదావరి--కావేరి అనుసంధాన ప్రతిపాదనను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్ రావు, సీనియర్ న్యాయవాదులు బెక్కం జనార్దన్, వీరబ్రహ్మచారి, ఎన్.పీ. వెంకటేష్, అనంతరెడ్డి, పరమేష్ గౌడ్, పి. వెంకటయ్య, వై. రవికుమార్ యాదవ్, విల్సన్, మన్యం, జగదీష్, మోహన్ నాయక్, పుట్టపాగ రఘుపతి, వెంకటరాములు యాదవ్, కరుణాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో ఆటో నడిపిన డ్రైవర్‌కు 3 రోజుల జైలు శిక్ష

మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మద్యం సేవించి ఆటో నడిపిన ఓ డ్రైవర్‌కు మహబూబ్‌నగర్ న్యాయస్థానం మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో నిందితుడిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. శుక్రవారం నిందితుడిని సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆర్. శశిధర్ న్యాయస్థానంలో హాజరుపరచగా, విచారణ అనంతరం మూడు రోజుల జైలు శిక్ష విధించారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, మద్యం సేవించి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# మిషన్ భగీరథ ద్వారా సరఫరాచేస్తున్నతాగు నీటిలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులుఅప్రమత్తంగా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**కల్వకుర్తి జులై 17 (ప్రజా జ్యోతి )**

కల్వకుర్తి మిషన్ భగీరథ 60 ఎంఎల్‌డీ త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, వేసవి వరకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండొద్దు, ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి, జిల్లా కలెక్టర్ కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్లతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు చెందిన మొత్తం 460 గ్రామాలకు తాగునీరు అందిస్తున్న మిషన్ భగీరథ కేంద్రం

ప్రజలకు నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమమని, మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని మిషన్ భగీరథ 60 ఎంఎల్‌డీ (మీాణ) వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఔపూ) త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు.ప్లాంట్‌లోని ప్రతి విభాగాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముడి నీటిని స్వీకరించే దశ నుంచి శుద్ధి పూర్తై గ్రామాలకు పంపిణీ చేసే వరకు జరిగే ప్రతి ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కోగ్యులేషన్, ఫ్లోక్యులేషన్, సెడిమెంటేషన్, ఫిల్టరేషన్, క్లోరినేషన్ వంటి శుద్ధి ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులతో చర్చించారు.

ఫిల్టర్ హౌస్‌లో ఉపయోగిస్తున్న యంత్రాల పనితీరు, పంపుల సామర్థ్యం, విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు తీసుకునే ప్రత్యామ్నాయ చర్యలు, శుద్ధి కోసం వినియోగిస్తున్న రసాయనాల మోతాదు, నీటి నాణ్యత పరీక్షల విధానం తదితర అంశాలపై సవివరంగా ఆరా తీశారు.

ప్రతిరోజూ ప్లాంట్‌కు ఎంత మేర ముడి నీరు వస్తుంది, ఎంత మేర శుద్ధి చేసి పంపిణీ చేస్తున్నారు, ఎన్ని గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది, సరఫరాలో ఎక్కడైనా సమస్యలు ఎదురవుతున్నాయా, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న నీరు ప్రభుత్వ త్రాగునీటి ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా నిరంతరం నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామానికి ప్రతిరోజూ నాణ్యమైన త్రాగునీరు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే త్రాగునీటిలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పంపింగ్ వ్యవస్థ, శుద్ధి కేంద్రం, నిల్వ రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. చిన్నచిన్న సాంకేతిక లోపాలు కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున యంత్రాలను ఎప్పటికప్పుడు నిర్వహణలో ఉంచాలని తెలిపారు.ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో నాగర్ కర్నూలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలు ప్రధానంగా మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీటిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అందువల్ల రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటి నిర్వహణపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.నీటి వృథాను పూర్తిగా నివారించాలని, పైప్‌లైన్లలో లీకేజీలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని, మోటార్లు, పంపులు, ఫిల్టర్ యూనిట్లు ఎప్పటికప్పుడు సక్రమంగా పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు. అవసరమైన రసాయనాల నిల్వలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, శుద్ధి ప్రక్రియలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు.

ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్ సింగ్ ప్లాంట్ పనితీరుపై కలెక్టర్‌కు సమగ్ర వివరాలు అందించారు. కల్వకుర్తి త్రాగునీటి శుద్ధి కేంద్రం నుంచి కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్లతో పాటు రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు చెందిన మొత్తం 460 గ్రామాలకు ప్రతిరోజూ సుమారు 52 లక్షల లీటర్ల శుద్ధి చేసిన త్రాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నీటి శుద్ధి కోసం వినియోగిస్తున్న రసాయనాలు, ప్రయోగశాలలో నిర్వహిస్తున్న నాణ్యత పరీక్షలు, ఫిల్టర్ హౌస్ నిర్వహణ, పంపింగ్ వ్యవస్థ, పంపిణీ నెట్‌వర్క్ తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు.అనంతరం కలెక్టర్ ప్రయోగశాలను సందర్శించి నీటి నాణ్యత పరీక్షల విధానాన్ని పరిశీలించారు. నీటిలో క్లోరిన్ శాతం, టర్బిడిటీ, పీహెచ్ విలువలు తదితర ప్రమాణాలను క్రమం తప్పకుండా పరీక్షించాలని, ప్రజలకు ఆరోగ్యకరమైన త్రాగునీరు అందించేందుకు అన్ని జాగ్రత్తలు కృషి కృషి తీసుకోవాలని అధికారులకు సూచించారు. శుద్ధి కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలను కూడా కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని, ఏ గ్రామంలోనైనా నీటి సరఫరా నిలిచిపోయినా లేదా నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైనా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మిషన్ భగీరథ పథకం గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అత్యంత కీలకమైన కార్యక్రమమని, అందుకు అనుగుణంగా అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, డీఈఈ మహిపాల్, మున్సిపల్ కమిషనర్ అహ్మద్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

# ఏనుగొండ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి డైరెక్టర్

**- ఎఫ్ ఎల్ ఎన్ అమలుపై పరిశీలన**

**- విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు, ప్రధానోపాధ్యాయురాలికి సత్కారం**



మహబూబ్‌నగర్, జూలై 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమం అమలును పరిశీలించేందుకు రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి డైరెక్టర్ రమేష్ శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా అర్బన్ మండలంలోని ఏనుగొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, అదనపు మండల విద్యాధికారి దుంకుడు శ్రీనివాస్, మండల విద్యాధికారి లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు. అధికారులు పాఠశాలలో విద్యార్థుల చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు, తరగతి గది బోధన, అభ్యాస ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులు అన్ని అంశాల్లో ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో తమ అభ్యాస ఫలితాలను ప్రదర్శించడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాల సాధనలో విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో నెలకొల్పిన పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని ప్రశంసిస్తూ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సూర్యలీలను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థి కేంద్రిత అభ్యాసానికి ప్రాధాన్యం ఇస్తూ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థిలో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞాన నైపుణ్యాల అభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

## స్కూటీపై అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు..

**- నిందితుడిని అదుపులోకి తీసుకున్న మిడ్జిల్ పోలీసులు.. కేసు నమోదు**

మిడ్జిల్, జూలై 17, ( ప్రజా జ్యోతి )మిడ్జిల్ పోలీసుల అప్రమత్తతతో అక్రమంగా తరలిస్తున్న సుమారు ఒక క్వింటాల్ పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, శుక్రవారం ఉదయం ఎస్‌హెచ్ఓ ఆదేశాల మేరకు బ్లూ కోల్ట్స్ సిబ్బంది కొత్తూర్ గ్రామ శివారులో విధులు నిర్వహిస్తుండగా, కొత్తూర్ నుంచి మల్లాపురం గ్రామానికి ఓ వ్యక్తి స్కూటీపై రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే మల్లాపురం రహదారిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయగా, టి ఎస్ 31 జె 0622 నంబర్ గల నీలం రంగు స్కూటీ అక్కడికి చేరుకుంది. పోలీసులు వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా, స్కూటీపై ఉన్న వ్యక్తి వాహనాన్ని వదిలి పారిపోవడానికి యత్నించాడు. అయితే అప్రమత్తమైన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడు ఊర్కొండ మండలం గుడిగానిపల్లి గ్రామానికి చెందిన లెగిశెట్టి వెంకటేష్ (తండ్రి: కృష్ణయ్య)గా గుర్తించారు. స్కూటీపై ఉన్న మూడు సంచులను తనిఖీ చేయగా, వాటిలో సుమారు ఒక క్వింటాల్ పీడీఎస్ బియ్యం ఉన్నట్లు తేలింది. నిందితుడు కొత్తూర్ గ్రామంలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, మల్లాపురం గ్రామంలో అధిక ధరకు విక్రయించి అక్రమ లాభం పొందాలనే ఉద్దేశంతో తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. పోలీసులు ఒక క్వింటాల్ పీడీఎస్ బియ్యం, మూడు సంచులు, స్కూటీని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.




## గ్రామంలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి.

విపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మండల కేంద్రంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మీసాల పర్వతమ్మ డాక్టర్ రాజశేఖర్ శు క్రవారం రోజు నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు దోమల నివారణ అంటువ్యాధుల నియంత్రణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను పరిశీలిస్తూ ప్రజలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని అవగాహన కల్పించారు గ్రామ అభివృద్ధికి పరిశుభ్రమైన వాతావరణమే పునాదిగా నిలుస్తుందని సర్పంచ్ మీసాల పర్వతమ్మ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మధుగని బాలపిరు గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి ఆశ వర్కర్లు పాల్గొన్నారు



# గ్రామ పంచాయతీ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక గడువులోగా పూర్తి చేయాలి

**-అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**- జీపి ఎస్ ఎ పి  అమలుపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష..**

**గ్రామసభల ఆమోదంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచన**



మహబూబ్‌నగర్, జూలై 17 (  ప్రజా జ్యోతి బ్యూరో ) : గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం రూపొందించిన గ్రామ పంచాయతీ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ ను నిర్దేశిత కాలపట్టిక ప్రకారం గడువులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కలెక్టరేట్‌లో సర్క్యులర్ మెమో నెం.92 ప్రకారం పంచాయతీ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ రోడ్‌మ్యాప్ అండ్ టైమ్‌లైన్స్ అమలుపై జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామస్థుల భాగస్వామ్యంతో స్థానిక అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులను ఎంపిక చేయాలని సూచించారు. ప్రణాళికల రూపకల్పనలో పారదర్శకత పాటిస్తూ గ్రామసభల ద్వారా వాటికి ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మండల స్థాయి బృందాలు, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యాచరణ ప్రణాళికలోని ప్రతి దశను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధికి ఈ ప్రణాళిక కీలకమని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, సీపీఓ రవీందర్, ఆర్డీఓ నవీన్, పీడీ హౌసింగ్ ఉపేందర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్లు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికులకు యూనిఫామ్ కిట్లు పంపిణీ



వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మన గ్రామ పరిశుభ్రత కోసం ఎండనక వాననుక పండుగలు సెలవులు అనే తేడా లేకుండా ప్రతి రోజూ విధులు నిర్వహిస్తున్న పరిశుద్ధ కార్మికుల సేవలు ఎంతో అమూల్యమైనవి అని గ్రామ సర్పంచ్ మీసాల పర్వతమ్మ అన్నారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికులకు యూనిఫామ్ పంపిణీ చేశారు సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం ప్రజలు ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు ప్రతి ఇంటి నుంచి వెలబడే చెత్తను సేకరించడం వీధులను  శుభ్రపరచడం పారిశుద్ధాన్ని  కాపాడడం ద్వారా వారు గ్రామ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు వారి సేవలను ప్రతి ఒక్కరు గౌరవించాలని గ్రామ ప్రజలంతా పరిశుభ్రత పాటిస్తూ గ్రామపంచా సిబ్బందికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ మధుగని బాల పిరు యాదవ్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆలస్యంగా వర్షాలు వచ్చిన నేపథ్యంలో సాగుకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలి

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించిన వ్యవసాయ శాఖ

గండీడ్, జూలై 17 (ప్రజాజ్యోతి): వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఆలస్యంగా వర్షాలు వచ్చినా సాగుకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల వ్యవసాయ అధికారులు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గండీడ్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రాధమ్మ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున రైతులు సంప్రదాయ పంటలతో పాటు తక్కువ వ్యవధిలో దిగుబడి ఇచ్చే, కరువును తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా కంది, కుసుమ, జొన్న, చిరుధాన్యాలు వంటి పంటలు సాగుకు అనుకూలమని తెలిపారు. అలాగే ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారులు నేలలో తేమను నిల్వ ఉంచేలా దుక్కి మిల్లింగ్, తేమ సంరక్షణ చర్యలు చేపట్టాలని, వర్షపు నీటిని వృథా కాకుండా సంరక్షించాలని సూచించారు. నేల పరీక్షల



ఆధారంగా సమతుల్య ఎరువులను వినియోగించడంతో పాటు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు అందించే సాంకేతిక సూచనలను పాటించాలని కోరారు. అదేవిధంగా ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని, సాగు చేసిన ప్రతి పంటను పంట నమోదు (క్రాప్ రిజిస్ట్రేషన్) చేయించుకోవాలని తెలిపారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంటల బీమా, పరిహారం వంటి ప్రయోజనాలు సకాలంలో అందుతాయని వివరించారు. రైతులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గండీడ్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సమత, వెన్నచేడ్ క్లస్టర్ ఏఈఓ వరలక్ష్మి, సెల్కర్‌పేట్ క్లస్టర్ ఏఈఓ మౌనిక, రైతు సోదరులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిరాశపరిచింది

గద్వాల (ప్రజా జ్యోతి) జూలై 17:

రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు ఆరోపించారు. శుక్రవారం ధరూర్ మండలంలోని గుడ్డెందొడ్డి,ర్యాలంపాడు రిజర్వాయర్ల కింద ఉన్న కాలువలను పార్టీ నాయకులు,రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు రిజర్వాయర్లను సందర్శించి నీటి నిల్వల వివరాలను తెలుసుకున్నారు. జూరాల రైట్ మెయిన్ కెనాల్‌ను పరిశీలించిన ఆయన,కాలువలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేపట్టడంతో పాటు కాలువల్లో పెరిగిన జమ్ము చెట్లను వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడుమాట్లాడుతూ,రిజర్వాయర్లలో నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు విడుదలచేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికినిదర్శనమన్నారు. రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు,వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో పందుల బెడదకు చెక్...

## పరిశుభ్రత కోసం మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ప్రత్యేక చర్యలు...

కల్వకుర్తి జులై 17( ప్రజా జ్యోతి):

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై,ఇళ్ల ముందు సంచరిస్తున్న పందుల బెడదను అరికట్టేందుకు శుక్రవారం కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత కొంత కాలంగా కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పందులు యథేచ్ఛగా తిరుగుతూ మురికిని పెంచుతూ, రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ లకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మున్సిపాలిటీ అధికారులతో సమన్వయం చేసుకుని పందులను పట్టుకుని మున్సిపాలిటీ వెలుపలికి తరలించే ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు.

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిశుభ్రతను కాపాడడమే లక్ష్యం...

కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్...

కల్వకుర్తి మున్సిపాలిటీలో పరిశుభ్రతను కాపాడడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి బాధ్యతని పందుల వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి మున్సిపాలిటీ అధికారుల సహకారంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్లు నాజియా మక్బూల్, షేక్ ఏజాస్,లతో పాటు మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి మున్సిపాలిటీ ప్రజల హర్షం....

పందుల బెడద తొలగించేందుకు కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ తీసుకున్న చర్యలపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యంగా పాఠశాలల పిల్లలు,వృద్ధులు రోడ్లపై స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం కలుగుతుందని వారు పేర్కొన్నారు.

